క్లుప్తంగా

బాలలకు ఆధ్యాత్మిక పోటీలు



గెలుపొందిన బాలలతో పెదలంక శ్రీ సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు

పెదలంక(భట్టిప్రోలు): మండలంలోని పెదలంక శ్రీ సత్యసాయి సేవా సమితి 39వ వార్షికోత్సవం పురస్కరించుకుని 'బాల వికాస్' బాల బాలికలకు సోమవారం భజన, పాటల పోటీలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వేములపల్లి వెంకటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల నిర్వాహకులు జాలాది సీతారామయ్య, చుండూరి సురేంద్ర, అన్నె రవికుమార్, ఎం.రాంబాబు, జాలాది కృష్ణవేణి, చుండూరు జానకి ముఖ్య అతిథులుగా విచ్చేసి బాల వికాస్ ప్రాముఖ్యత, మానవతా విలువలు గురించి తెలియజేశారు. గెలుపొందిన బాల బాలికలకు బహుమతులు అందజేశారు. బాపట్ల జిల్లాలోని 21 గ్రామాల నుంచి 192 మంది బాలవికాస్ బాలలు, 29 మంది గురువులు, భక్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వేమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం లలితా సహస్రనామం, విష్ణు సమస్ర నామం, వాసవీ పారాయణం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

షాపుల నిర్వహణకు నేడు వేలం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ లింగోద్భవ స్వామి దేవస్థానం ఆవరణలో ఆగ్నేయ భాగాన 1, 2 షాపులను 38 నెలల కాల పరిమితికి బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ జి.నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు దేవస్థానం నందు బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు కాలపరిమితి ఉంటుందని తెలిపారు.

జగనన్న బడుగు వికాసం.. ఐదు యూనిట్లు మంజూరు

పిట్టలవానిపాలెం: మండలంలో జగనన్న బడుగు వికాసం పథకం కింద 5 యూనిట్లు మంజూరైనట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సంతోష్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రభుత్వం జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా నాలుగు చక్రాల వాహనాలు కొనుగోలుకు ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుని వాటా 10 శాతం, బ్యాంకు రుణం 45 శాతం అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని బస్టాండ్ నుంచి గుడ్డికాయలంక అక్కిలేరు వరకు.. జేఎల్‌బీ కళాశాల రోడ్డు, బేతపూడి రోడ్డు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గణపతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేద బ్రాహ్మణులు గ్రామ దేవత కట్లమ్మకు చద్ది నైవేద్యాలు సమర్పించారు. రాత్రి 8 గంటలకు మహా గణపతి పూజ నిర్వహించారు. వైదిక పుణ్యాహవచనం, దీక్ష స్వీకరణ, కంకణ ధారణ, అంకురార్పణ, వాస్తు పూజ, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు హోమం, పర్యగ్నికరణ అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరిరావు తనయుడు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పంచాహ్నిక దీక్షతో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ తిరునాళ్ల ప్రారంభమయ్యాక చుట్టుపక్కల ప్రాంతాలలో తిరునాళ్లు జరుగుతాయి. దేవాలయ నిర్మాణానికి పాటుపడిన తాడికొండ వంశీయులు క్రమం తప్పకుండా ఏటా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా పాలన

'గడప గడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి



స్టువర్టుపురంలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మండలంలోని స్టువర్టుపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యం క్రమంలో అన్ని అభివృద్ధి పనులు చేస్తామని ప్రజలకు వివరించారు. అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజలకు సేవలు అందించేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. జగనన్న కాలనీల్లో నివేశన స్థలాలు అందించి, పక్కా ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా చేపడుతున్నట్లు చెప్పారు. స్టువర్టుపురం గ్రామంలో రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, సర్పంచ్ భోగిరి ప్రసాద్, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, వడ్డి ముక్కల డేవిడ్, డాక్టరు రాజేష్, రాగా మధు, సంజీవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకు.. వంద రోజులకు

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని 9వ వార్డులో తొలి రోజు ప్రారంభమైన గడగ గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 100వ రోజుకు చేరింది. మండలంలోని స్టువర్టుపురంలో మంగళవారం వంద రోజుల వేడుకలు నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. బాపట్ల నియోజకవర్గంలో 48 సచివాలయాల పరిధిలో 49,722 గృహాల ప్రజలతో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ.. పరిష్కారంలో నిత్య పర్యవేక్షణకు ఒక కమిటీని నియమించారు. వీరు అర్జీలపై ప్రతి రోజూ విచారణ చేస్తుంటారు.

ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు నమ్మకం పెరిగింది



వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నిజాంపట్నం: కరోనా సమయంలో వైద్య సిబ్బంది విస్తృత సేవలు అందించడంతో ప్రజల్లో ప్రభుత్వ వైద్యశాలలపై నమ్మకం మరింత పెరిగిందని ఎంపీడీవో నాగలక్ష్మి పేర్కొన్నారు. నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బందితో ఆమె సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వసతులను, సాంకేతిక నైపుణ్యంతో కూడిన పరికరాలను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. ఇవన్నీ ప్రజలకు ఉపయోగ పడేలా బాధ్యతగా పనిచేసి, సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కన్నా శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరరావు, పరిశా శ్రీలక్ష్మి ఉన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన మండలంలోని సచివాలయాల సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణాలు, పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి

రేపల్లె: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవతో వేద మంత్రాల నడుమ పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో మహిళలు శ్రీ లలితా సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

26న సామూహిక అక్షరాభ్యాసం

రేపల్లె రూరల్: వసంత పంచమిని పురస్కరించుకుని పట్టణంలోని 12వ వార్డు హౌసింగ్‌బోర్డ్ కాలనీలో ఉన్న శ్రీరామకృష్ణ విద్యా నిలయంలో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాఠశాల నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించదలచిన తల్లిదండ్రులు పూర్తి వివరాలకు పాఠశాలలో గాని, 99495 31772 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): ఎస్సీ, ఎస్టీల సబ్‌ప్లాన్‌ను పది సంవత్సరాలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పెద పులివర్రులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్ మ్యానిఫెస్టోలో చెప్పినవి, చెప్పనవి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

వేమూరు: ఎస్సీల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ఎంపీపీ యల్లమాటి మోహన్ పేర్కొన్నారు. వేమూరు దళితవాడలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దళిత వాడల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయన్నారు. అందు వల్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సబ్ ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగిస్తు ఆర్డినెన్స్ జారీ చేసినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లి ముంత ఏడుకొండలు, కో-ఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మురారీ రాంబాబు, యల్లమాటి సుధాకర్, దున్నా మేరీసుబాబు, ఎంపీటీసీ బుల్లా రత్న కుమారి, దాసరి ముత్తయ్య, కూచిపూడి మోషే, చిలకా ప్రకాశ్, అళ్లమూడి మధు, కంపటి దావీదు, మోషే, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జననం తప్ప.. మరణం లేని నేతాజీ



నేతాజీ విగ్రహం వద్ద విద్యార్థుల నివాళి



చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, అధికారులు

పిట్టలవానిపాలెం: జననం తప్ప మరణం లేని మహా నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కే జుబేర్ పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం నేతాజీ సుభాస్‌చంద్ర బోస్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. నేతాజీ స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత విమాన ప్రమాదంలో నేతాజీ మరణించారని చెప్పడమే కానీ.. ఆయన చనిపోయినట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీఈటీ శ్యామల సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

భట్టిప్రోలు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు, జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి సాంబశివరావు, ఈవోపీఆర్డీ సీహెచ్ శేఖర్, సూపరింటెండెంట్ జలజ, మండల సమాఖ్య ఏపీఎం కొండూరు శోభన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో సుభాస్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘన నివాళి

నగరం: స్వాతంత్రోద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలకపాత్ర పోషించారని ఎస్వీఆర్ఎం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పీవీ నారాయణ, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ కె.సురేష్ బాబు, అధ్యాపకుడు ఎస్ విజయ్‌బాబు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

దమ్మనవారిపాలెం(కర్లపాలెం): నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం కావాలని జనసేన పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ తెలిపారు. నేతాజీ సుభాస్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా జనసేన పార్టీ నాయకులు దమ్మనవారిపాలెం గ్రామంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేశారు.

ఐలవరం విద్యార్థుల ప్రతిభ

ఐలవరం(భట్టిప్రోలు): చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలో ఏపీఎస్ ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎన్ఎంఎంఎస్ గ్రాండ్ టెస్ట్‌లో ద్వితీయ స్థానం సాధించిన మండలంలోని ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నాగ కౌసల్య, వేమూరు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వేమవరపు లక్ష్మణ్‌ను సోమవారం అభినందించారు. ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు వేదాంతం బదరీనారాయణ, జీవీ నారాయణ, రవిరామ కిషోర్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత

బాపట్ల అర్బన్: తెలుగుదేశం పార్టీ నాయకుడు అసోది భాస్కర్‌రెడ్డి సోదరుడు నాగార్జునరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఎమ్మెల్యే కోన రఘుపతి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పడమర బాపట్ల నుంచి భారీ ద్విచక్ర వాహన ప్రదర్శనతో ఎమ్మెల్యే నివాసానికి చేరుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కోన రఘుపతి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

రేపల్లె రూరల్: బాలిక అదృశ్యమైన ఘటన మండలంలోని పేటేరు గ్రామంలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ వివరాలు మేరకు.. పేటేరు గ్రామానికి చెందిన మైనర్ సోమవారం ఉదయం రేపల్లె పట్టణంలోని కళాశాలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు బాలిక స్నేహితులు, బంధువుల ఇళ్లలో విచారించినా ఆచూకి లభించలేదు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత

గుంటూరు ఎడ్యుకేషన్: మైనర్లకు వాహనాలను ఇవ్వడం ద్వారా జరిగే పరిణామాలకు వారి తల్లిదండ్రులనే బాధ్యులుగా చేస్తామని క్రైం, ట్రాఫిక్ విభాగ అదనపు ఎస్పీ ఎ. శ్రీనివాసరావు హెచ్చరించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ విభాగాల ట్రాఫిక్ సీఐలు షేక్ నిస్సార్ బాషా, ఎం.శేషగిరిరావు, ట్రాఫిక్ ఎస్సై షేక్ మౌలానా షరీఫ్, శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్‌కు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు

జంపని(వేమూరు): జంపని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బద్రి నారాయణ సోమవారం తెలిపారు. విద్యార్థులు జె.మహి, కె.దీప్తి సురేఖ, షేక్ సమ్రీన్ గుంటూరు జిల్లా ముప్పాళ్ల మండలంలోని బొల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20న జరిగిన జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ నెల 28, 29, 30, తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

వైభవంగా బాలకోటయ్య తిరునాళ్ల నిర్వహణకు కృషి



తిరునాళ్ల నిర్వహణపై సమీక్షిస్తున్న అధికారులు

రేపల్లె రూరల్: మహా శివరాత్రిని పురస్కరించుకుని ఫిబ్రవరి 18న అరవపల్లి గ్రామ తిరునాళ్లు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వీర వసంతరావు సూచించారు. తిరునాళ్ల నిర్వహణపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం సోమవారం నిర్వహించారు. ఆలయానికి రంగులు, దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు, భక్తులు పొంగళ్లు పొంగించడానికి ప్రత్యేక స్థలంపై చర్చించారు. ఆర్టీసీ అధికారులు అరవ పల్లికి ప్రత్యేక సర్వీసులతో పాటు.. ఆలయ సమీపంలో నిలుపుదల చేసేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. సమీపంలోని జిల్లాల ప్రజలు కూడా అధిక సంఖ్యలో తిరునాళ్లకు వచ్చే అవకాశం ఉందని, పోలీసులు ఎటువంటి అపశృతి జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. అగ్నిమాపక, వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. బొబ్బర్లంక, మోళ్లగుంట పీహెచ్‌సీల సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నాగాంజనేయులు



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

రేపల్లె: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వం రంగంలోనే కొనసాగించాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రేపల్లె ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసనలో నాగాంజనేయులు పాల్గొని, మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్ర పూరిత ఆలోచన విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం పోరాటాలు, బలిదానాలతో సాధించుకున్నదన్నారు. నేడు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పోస్కో కంపెనీకి కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్డీవో పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు చొక్కాకుల శివ శంకర్, గొట్టుముక్కల శ్రీమన్నారాయణ, పరుచూరి వెంకటేశ్వరరావు, సిరంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాల వెంకటేశ్వర్లు, సజ్జా రాజబాపయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: విద్యార్థుల్లోని దేశభక్తిని నింపేందుకు, సృజనాత్మక పెంపొందించేందుకు పోటీలు దోహదం చేస్తాయని నల్లపాడు కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపల్ హనిమెహత తెలిపారు. పాఠశాలలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జీవితంపై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు చిత్రలేఖనం పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని జయించేదుకు ఒక ప్రత్యేకమైన చొరవతో దేశవ్యాప్తంగా 500 విద్యాలయాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహించటం జరిగిందన్నారు. ఈ పోటీలలో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సీబీఎస్ఈ విద్యాలయాలకు చెందిన 50 వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు వివరించారు. జిల్లాలోని స్టేట్ బోర్డ్, సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాలకు చెందిన 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారన్నారు. విజేతలకు స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, శ్రీదేవి, సునీల, మృత్యుంజయరావు, శ్రీరామ్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు బీఆర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, సూపర్ వైజర్లు ఫజురున్నీస్సా, డీబీఎస్ లత సోమవారం నిర్వహించిన తనిఖీలో గుర్తించారు. అంగన్‌వాడీలో రిజిస్టర్‌లో 15 మంది పిల్లలు ఉండగా.. ముగ్గురు మాత్రమే ఉన్నారని, రిజిస్టర్‌లోని స్టాక్‌తో సంబంధం లేకుండా కోడిగుడ్లు, ఆయిల్, పాల ప్యాకెట్లు ఉన్నట్లు ఈ తనిఖీలో బయట పడింది. ఈ విషయమై అంగన్‌వాడీ కార్యకర్త సీహెచ్ దుర్గమ్మను ప్రశ్నిస్తే రేషన్ డీలర్ స్టాక్ ఇవ్వలేదని కుంటి సాకులు చెప్పడంతో.. వారు సంబంధిత డీలర్‌కు ఫోన్ చేశారు. సరుకు ఇవ్వగానే వేలిముద్ర వేయించుకుంటామని అప్పుడే సరుకు అంతా ఇస్తామని తెలిపారు. ప్రతి వారం అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ నిర్వహించే మహిళా పోలీస్ కె.తిరుమల ఇవన్నీ.. ఎందుకు గమనించలేదని ఎంపీపీ, జడ్పీటీసీ ప్రశ్నించారు. రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ సీడీపీఓ మాణిక్యం ఈ విషయంపై స్పందించారు. అంగన్‌వాడీ కార్యకర్త దుర్గమ్మకు మెమొ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మూడు రోజుల్లోగా మళ్లీ తనిఖీ చేస్తామని, రిజిస్టర్ సంఖ్య ప్రకారం పిల్లలను చూపాలని, సరుకులను కొనుగోలు చేసైనా కేంద్రంలో ఉంచాలని సూచించినట్లు పేర్కొన్నారు.